సర్పంచ్‌లకు 14, వార్డులకు 77..

● మొదటి రోజు దాఖలైన నామినేషన్లు ● నామినేషన్ సెంటర్లను పరిశీలించిన డీసీపీ, ఎంపీడీవో

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని 14 గ్రామాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు సర్పంచ్ స్థానాకుల 14, వార్డు స్థానాలకు 77 నామినేషన్లను అభ్యర్థులు దాఖాలు చేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి 2 సర్పంచ్, వార్డు 11, కవాడిపల్లి సర్పంచ్ 1, వార్డు 6, బలిజగూడ సర్పంచ్ 1, వార్డు 2, బాటసింగారం సర్పంచ్ 2, వార్డు 8, పిగ్లీపూర్ సర్పంచ్ 1, వార్డు 6, జాఫర్‌గూడ సర్పంచ్ 1, వార్డు 17, చిన్నరావిరాల సర్పంచ్ 1, వార్డు 8, మజీద్‌పూర్ సర్పంచ్ 3, వార్డు 10, లష్కర్‌గూడ సర్పంచ్ 1, వార్డు 6, ఇనాంగూడ సర్పంచ్ 1, వార్డు 3 నామినేషన్లను అధికారులు స్వీకరించారు. బండరావిరాల, అనాజ్‌పూర్, గుంతపల్లి, గండిచెరువు గ్రామాల నుంచి ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదు.

నామినేషన్ స్వీకరణకు 5 సెంటర్లు

అభ్యర్థుల నుంచి నామినేషన్ స్వీకరణ కోసం 5 సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. బాటసింగారం సర్పంచ్ అభ్యర్థిగా బీజేపీ బలపర్చిన బండిగారి విష్ణుగౌడ్ బుధవారం ఆపార్టీ రాష్ట్ర నాయకులు బోసుపల్లి ప్రతాప్, కొత్త అశోక్‌గౌడ్, జంగమయ్య గౌడ్‌తో కలిసి తన నామినేషన్ పత్రాలను ఆర్‌వోకు అందజేశారు. అబ్దుల్లాపూర్‌మెట్ సర్పంచ్ అభ్యర్థిగా చెరుకు కావ్య శివశంక్‌గౌడ్, కిక్కిర జయశ్రీగోపిశంకర్ యాదవ్ నామినేషన్ వేశారు. వారితో పాటు వార్డు సభ్యుల తమ నామినేషన్‌ను దాఖలు చేశారు.

నామినేషన్ క్లస్టర్లను పరిశీలించిన డీసీపీ

అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని నామినేషన్ క్లస్టర్ గ్రామాలను బుధవారం ఎల్‌బీనగర్ డీసీపీ అనురాధ, అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, వనస్థలిపురం ఏసీపీ కాశీరెడ్డితో కలిసి సందర్శించారు. అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, బండరావిరాల, లష్కర్‌గూడ, అనాజ్‌పూర్ గ్రామాల్లోని సెంటర్‌లను ఎంపీడీవో శ్రీవాణితో కలిసి పరిశీలించారు. నామినేషన్ సెంటర్ల వద్ద ఏలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి, ఎస్ఐ మాదవరావుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



బాటసింగారం క్లస్టర్‌లో నామినేషన్ వేసేందుకు బారులు తీరిన సర్పంచ్, వార్డు అభ్యర్థులు

బారులుదీరిన అభ్యర్థులు

ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు అధికారులు సమయం కేటాయించారు. కాగా, మొదటి రోజు ఉదయం 11 గంటల తర్వాత కొంతమంది సర్పంచ్, వార్డు సభ్యులు తమ నామినేషన్ పత్రాలను అధికారులకు సమర్పించారు. అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, అనాజ్‌పూర్ క్లస్టర్‌లో మధ్యాహ్నం తర్వాత చాలా మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు బారులుదీరారు. సాయంత్రం 5 గంటల వరకు క్యూలో ఉన్న వారందరి నుంచి అధికారులు నామినేషన్లను స్వీకరించారు. ఒక్కో క్లస్టర్‌లో 3 గ్రామాలు ఉండడంతో దరఖాస్తుల స్వీకరణ కొంత ఆలస్యమైనట్లు తెలుస్తోంది. నామినేషన్ వేసేందుకు వచ్చిన సర్పంచ్, వార్డు అభ్యర్థులకు ఒకే లైన్ ఏర్పాటు చేయడంతో కొంత ఆలస్యం అయినట్లు తెలుస్తోంది.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి: శ్వేతారెడ్డి

సైదాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కార్పొరేటర్ శ్వేతారెడ్డి సూచించారు. బుధవారం పూర్ణోదయ కాలనీలో రూ.37.30లక్షల వ్యయంతో ఫుట్‌పాత్, వాకింగ్ ట్రాక్, బృందావన్ కాలనీలో రూ.15లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. నిర్మాణ పనుల జాప్యంపై కాంట్రాక్టర్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శిరీష, బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు మధుకర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సలీంనగర్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మిరెడ్డి

చాదర్‌ఘాట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ముసారాంబాగ్ డివిజన్ లోని సలీంనగర్ కాలనీలో గల సఫైర్ ఫంక్షన్ హాల్ లేన్‌లో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి బుధవారం ప్రారంభించారు. రూ.13లక్షల వ్యయంతో నూతన సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఆమె వివరించారు. వరద నీరు నిలువకుండా సీసీ రోడ్డును నిర్మించాలని ఆమె జీహెచ్‌ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డికి సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కొప్పుల దినేష్‌కుమార్ పటేల్, సురేష్‌కుమార్, యాదయ్య, వెంకట్ పాల్గొన్నారు

హస్తినాపురానికి రూ.5కోట్లు మంజూరు



కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ అభివృద్ధికి జీహెచ్‌ఎంసీ రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసిందని స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతానాయక్ తెలిపారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 24 నెలలో డివిజన్‌లో సుమారు రూ.100 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. డివిజన్ అభివృద్ధికి జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ సహకారం మరువలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గోపీరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

నేడు రాగన్నగూడలో టీపీఓ, ఫ్యాకల్టీ మీట్

కొత్తపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీ డాక్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రాగన్నగూడలోని హార్డ్‌వేర్ పార్కులో నేడు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్(టీపీఓ), ఫ్యాకల్టీ మీట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పరిశోధన, అభివృద్ధి సంస్థ సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖల ఫ్యాకల్టీ, విశ్వవిద్యాలయాలు ఇంజనీరింగ్ కాలేజీలు, పాలిటెక్నిక్ కాలేజీలు, ఐటీఐలు ఎస్‌టీఈఎం సబ్జెక్టులు బోధించే పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్లు, డీన్స్ ప్రిన్సిపాళ్లు, విభాగాల అధిపతులు, టీపీఓల కోసం ఈ మీట్ రూపొందించామని సీ డాక్ హైదరాబాద్ హెడ్, సైంటిస్టు - జీ డాక్టర్ పీఆర్ లక్ష్మీఈశ్వరి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్, ఇంటర్న్‌షిప్ పథకాలు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ ఉపాధి అవకాశాలు మెరుగుపరచే వ్యూహాలు, పరిశ్రమ ఆధారిత శిక్షణ తదిర అంశాలపై ఈ మీట్‌లో నిపుణులు చర్చిస్తారన్నారు. మరిన్ని వివరాలకు కో ఆర్డినేటర్ ను ఇటౌజిఢీఃచిఛ్చిఛి.ఢీ ద్వారా లేదా 91- 7207265580 నెం. కాల్ చేయవచ్చని తెలిపారు.



ఆగమయ్యనగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

ముంపు సమస్యను పరిష్కరిస్తా: కొప్పుల

మన్సూరాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్‌లోని అన్ని కాలనీలలో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి కృషి చేస్తానని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. తరచూ వరద ముంపునకు గురవుతున్న ఆగమయ్యనగర్ కాలనీలో సుమారు రూ.65లక్షల వ్యయంతో చేపట్టనున్న వరద నీటి కాలువ నిర్మాణ పనులకు, అదే కాలనీలో రూ.5లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ యాదవ్, కాలనీ ప్రతినిధులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు సంతోష్‌కుమార్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు యాదయ్య, వసుధ, సుజాత, అరుణ, శ్రీరాములు, బోసు, ఉమేశ్, ఆంజనేయులు, వెంకటాచారి, వెంకయ్య, ధనలక్ష్మి, నాయకులు లింగాచారి, నవీన్ గుప్తా, సాయి పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ డిగ్రీ కాలేజీకి 'హెరిటేజ్' సహకారం

సరూర్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకవర్గం లోని బడంగ్‌పేట్‌లో గల ప్రభుత్వ డిగ్రీ కాలేజీ తెలంగాణ ప్రభుత్వంలోని హెరిటేజ్ డిపార్ట్‌మెంట్‌తో ఎంవోయూ కుదుర్చుకుంది. దాంతో ఇకపై హెరిటేజ్‌కు సంబంధించిన అంశాలపై కళాశాలకు సదరు విభాగం సంపూర్ణ సహకారం అందించనున్నది. ఈ క్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందానికి హెరిటేజ్ విభాగం అధికారులు పలు పరిశోధనలపై అవగాహన కల్పించనున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ ప్రసాద్ తెలిపారు. ఈ ఒప్పందంతో విద్యార్థులకు హిస్టరీ, కల్చర్, హెరిటేజ్‌కు సంబంధించిన అంశాలపై పూర్తి అవగాహన ఏర్పడనున్నదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ కె.వెంకన్న, డాక్టర్ కిషోర్, హెరిటేజ్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నాగరాజు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లారెడ్డి, కాలనీ ప్రతినిధులు

ఆర్వీఆర్ కాలనీ పార్కు స్థలాన్ని కాపాడండి

సరూర్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 25వ డివిజన్‌లో గల ఆర్‌వీఆర్ కాలనీలోని పార్కు స్థలాన్ని కబ్జాబారి నుంచి కాపాడి రక్షణ చర్యలు చేపట్టాలని కాలనీవాసులు అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ నాయకుడు నవారు మల్లారెడ్డి ఆధ్వర్యంలో కాలనీ ప్రతినిధులు మునిసిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇక్కడి సర్వే నంబర్లు.126, 127లలో గతంలో వెంచర్ చేసినప్పుడు 1,560 గజాల ఖాళీ స్థలాన్ని ప్రజా ప్రయోజనార్థం వదిలిపెట్టారని, తాజాగా కొందరు కబ్జాదారులు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి సదరు స్థలాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని అధికారులకు వివరించారు. వెంటనే సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకుని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, ప్రతినిధులు శంకర్‌జీ, శ్రీశైలం, అశోక్, యోగేందర్, రామాచారి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్.. దివ్యాంగుల దినోత్సవం మరిచిపోయావా?

● మాజీ మంత్రి సబితారెడ్డి



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న సబితారెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'రేవంత్ .. దివ్యాంగుల దినోత్సవాన్ని మరిచిపోయావా?' అని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి నిలదీశారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతియేటా దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, దివ్యాంగుల కోసం పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేదని గుర్తు చేశారు. బుధవారం దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు దివ్యాంగులకు ఆమె ట్రై సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ అధికారికంగా నిర్వహించాల్సిన ఈ ఉత్సవాన్ని అటకెక్కించారని మండిపడ్డారు. దివ్యాంగుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత ప్రేమ ఉందో దీనిని బట్టి అర్థం చేసుకోచ్చునని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అర్కల కామేశ్ రెడ్డి, మురుకుంట్ల అరవింద్‌శర్మ, అర్కల భూపాల్‌రెడ్డి, మాదరి రమేశ్ , రాజ్‌కుమార్, లక్ష్మణ్ ముదిరాజ్, గోపీ యాదవ్, ప్రభాకర్‌రెడ్డి, విజయలక్ష్మి, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సామర్థ్యాలు సమాజ పురోగతికి దోహదం



సదస్సులో మాట్లాడుతున్న న్యూరో సర్జన్ డా.నవీన్ మెహరోత్రా

కొత్తపేట, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తే, వారి సామర్థ్యాలు సమాజ పురోగతికి దోహదపడతాయని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రుల సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్, స్పైన్ సర్జన్ డా.నవీన్ మెహరోత్రా అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేళ బుధవారం మోహన్‌నగర్‌లోని మానస పిల్లల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థలో దివ్యాంగుల సమ్మిళితతో సామాజిక పురోగతి అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డా.నవీన్ మెహరోత్రా తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిర్లా సైన్స్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డా.మృత్యుంజయరెడ్డి, కాగ్నిటివ్ బోటిక్ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ ఉదయ్‌కుమార్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ బి.విజయలక్ష్మి, తెలంగాణ డిస్లెక్సియా అసోసియేషన్ వ్యవస్థాపకులు మనీషాగోగ్డే, మానస అధ్యక్షుడు డా.బీ. దినేష్‌కుమార్, ప్రిన్సిపాల్ జి.విజయభాను, క్లినికల్ కో ఆర్డినేటర్ బి.అనిత, థెరపిస్టులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'4శాతం రిజర్వేషన్లను అమలు చేయాలి'

చాదర్‌ఘాట్: అర్హులైన దివ్యాంగులకు 4శాతం రిజర్వేషన్లను జీహెచ్‌ఎంసీ, ఆర్టీసీ దేవాదాయ, ధర్మాదాయ శాఖ, పోలీసు శాఖలోని ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల్లో తక్షణమే అమలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్ ఎంప్లాయిడ్ దివ్యాంగ్ అసోసియేషన్ ఆఫ్ యూత్ (ఉదయ్) అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మలక్‌పేటలోని ఫెడ్ పార్క్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన డిమాండ్లన్నింటినీ సాధించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందించినట్లు ఆయన వివరించారు.

పారా క్రీడాకారులకు సన్మానం

ఎల్బీనగర్: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సరూర్‌నగర్ శ్రీ వెంకటేశ్వర కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కాలనీ సంక్షేమ సంఘం సహకారంతో జాతీయ, అంతర్జాతీయ పారా పోటీలలో పతకాలు సాధించిన క్రీడాకారుల సన్మాన కార్యక్రమం సన్మానించారు. ముఖ్యఅతిథిగా ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య హాజరై క్రీడాకారులను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో ద్రోణాచార్య పారా స్పోర్ట్స్ అకాడమీ ఫౌండర్ వేణు, కాలనీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రావు, మునగాల నరేష్, సుధాకర్, చారి, కిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

ఓటర్ల పేరు తొలగించకుండా ఉద్యమం

● హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఖాలీద్ సైఫుల్లా



ఖాలీద్ సైఫుల్లాను సన్మానిస్తున్న చెకోలేకర్ లక్ష్మి, శ్రీనివాస్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, డివిజన్ల అధ్యక్షులు

చాదర్‌ఘాట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎస్ఐఆర్ తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అమలులోకి రానున్న నేపథ్యంలో ఏ ఒక్క ఓటరు పేరు జాబితా నుంచి తొలగించకుండా కాంగ్రెస్ పార్టీ తరఫున పెద్ద ఎత్తున ఉద్యమం చేయనున్నట్లు హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు ఖాలీద్ సైఫుల్లా తెలిపారు. బుధవారం సలీంనగర్‌లోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకర్ లక్ష్మీశ్రీనివాస్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకోలేకర్ శ్రీనివాస్ నివాసానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి మాసంలో ఓటర్ల జాబితా పరిశీలన జరగనుందని తెలిపారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో ఏ ఒక్క ఓటరు పేరు ఓటర్ జాబితా నుంచి తొలగింపు జరగకుండా ఉండేందుకు ప్రతి పోలింగ్ బూత్ కు బీఎల్‌వో-1, 2లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్ర స్థాయిలో మరింత పటిష్ఠ పరిచేందుకు హైదరాబాద్ జిల్లా పరిధిలో నియోజకవర్గాల వారీగా పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీణ్‌కుమార్ పటేల్, డివిజన్ల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్‌గౌడ్, రాహుల్, చక్రపాణి, షాహిద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కిషన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలి

బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రధాన కార్యదర్శి భాస్కర్



హయత్‌నగర్‌లో సీఎం దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

హయత్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిందూ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రధాన కార్యదర్శి బండారు భాస్కర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిందు దేవతలను కించపరిచారని ఆరోపిస్తూ వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం హయత్‌నగర్ కెనరా బ్యాంకు చౌరస్తా వద్ద ముఖ్యమంత్రి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పారంద మహేష్, గోవిందాచారి, అఖిల్ రెడ్డి, జంగారెడ్డి, ఎర్ర ప్రేం, అభిలాష్, లక్ష్మణ్, యువ శక్తిసింగ్, ప్రణవ్‌రెడ్డి పాల్గొన్నారు.

సైదాబాద్ ప్రధాన రహదారిపై..

సైదాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి హిందూ దేవుళ్లను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ బుధవారం సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి ఆధ్వర్యంలో సైదాబాద్ ప్రధాన రహదారిపై ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకుని నేతలను ఆదుపులోకి తీసుకుని సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిందర్ రెడ్డి, జంగం మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సైదాబాద్‌లో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ అరుణారెడ్డి, నేతలు

బీజేపీ మీర్‌పేట్ చౌరస్తాలో..

సరూర్‌నగర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి హిందూ దేవతలపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మీర్‌పేట్ కార్పొరేషన్ క్లస్టర్-12 అధ్యక్షుడు పసునూరి భిక్షపతిచారి, తులసి ముఖేశ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బుధవారం మీర్‌పేట్ చౌరస్తాలో పార్టీ నాయకులతో కలిసి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కెసోమేశ్వర్, పార్టీ నాయకులు సిద్ధాల శ్రీనివాస్, ఇంద్రావత్ రవినాయక్, గాజుల మధు, ఎ.బీమ్ రాజ్, కీసరి కృష్ణారెడ్డి, ప్రభాకర్, లతాశ్రీ, హైందవి రజని, బుచ్చిరాములు, రాజశేఖర్, కాశీరాం యాదవ్, రామేందర్ ముదిరాజ్, ప్రదీప్ పాల్గొన్నారు.

వనస్థలిపురంలో..

మన్సూరాబాద్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం బీజేపీ అధ్యక్షుడు కాటం క్రాంతిగౌడ్ ఆధ్వర్యంలో బుధవారం రెడ్‌వాటర్ ట్యాంక్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ చిట్టిప్రోలు రవికుమార్, నాయకులు నూతి శ్రీనివాసరావు, నాయిని శ్రీకాంత్‌రెడ్డి, ఆది నరసింహారావు, అరుణ్‌జోగి, చీలా రోజా, దాసోజు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డికి సమస్యను వివరిస్తున్న పెద్దఅంబర్‌పేట్ కాలనీల వాసులు

కాలనీల మధ్యలో ఎస్టీపీ ఏర్పాటు చేయొద్దు

● ఎమ్మెల్యే మల్‌రెడ్డికి పెద్దఅంబర్‌పేట్ వాసుల వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): కాలనీల మధ్యలో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)ను ఏర్పాటు చేయొద్దని పెద్దఅంబర్‌పేట్‌లోని అంబికానగర్, పోలీస్‌కాలనీ, దయాకర్‌రెడ్డి కాలనీలవాసులు, స్థానిక నాయకులు కోరారు. బుధవారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఆయా కాలనీవాసులు కలిసి పెద్దఅంబర్‌పేట్ ఈదుల చెరువు సర్వే నంబర్ 292 ఎఫ్‌టీఎల్, కాలనీల మధ్యలో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ) ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలకు దూరంగా ఏర్పాటు చేసుకుంటే తమకు ఏలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి సీవరేజ్ బోర్డు ఎండీతో ఫోన్‌లో మాట్లాడినట్లు మాజీ మున్సిపల్ చైర్మన్ పండుగుల జయశ్రీరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధంకి కృష్ణారెడ్డి, చల్లూరి మురళీధర్‌రెడ్డి, వడ్డేపల్లి విజయేందర్‌రెడ్డి, దండెం రాజశేఖర్‌రెడ్డితో పాటు ఆయా కాలనీ వాసులు పాల్గొన్నారు.



శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రతినిధులు

శ్రీకాంతాచారి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలి

చాదర్‌ఘాట్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆత్మార్పణ చేసిన శ్రీకాంతాచారి విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని, ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని స్వర్ణకార సంఘం డిమాండ్ చేసింది. శ్రీకాంతాచారి వర్ధంతి సందర్భంగా బుధవారం స్వర్ణకార సంఘం మలక్‌పేట ఎల్‌బీనగర్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో గడ్డిఅన్నారం మదురాపురి కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్రంలోని ఏదైనా యూనివర్శిటీకి శ్రీకాంతాచారి పేరు పెట్టాలని తెలంగాణ స్టడీ ఫోరం అధ్యక్షుడు నెక్కొర్తి శ్రీనివాసాచారి హైదరాబాద్ జేఏసీ చైర్మన్ శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కీర్తిగారి అనంతాచారి, ప్రధాన కార్యదర్శి శ్రీరామదాసు గోవర్ధనాచారి, కోశాధికారి తటుకునూరు రవిచారి, గౌరవ అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాసాచారి కోఆర్డినేటర్ నారాయణదాస్, సంఘం రాష్ట్ర నాయకులు ఎర్రోజు వేణుగోపాల్, సంఘం ఉపాధ్యక్షుడు చెన్నోజు శ్రీనివాసాచారి, శ్రీరామాదాసు తిరుపతి చారి, పోద్దారి నర్సింహచారి తదితరులు పాల్గొన్నారు.



హయత్‌నగర్‌లో శ్రీకాంతాచారి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ తదితరులు

శ్రీకాంతాచారికి ఘన నివాళి

హయత్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతాచారి వర్ధంతిని బీఆర్ఎస్ హయత్‌నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంతాచారి చిత్ర పటానికి బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్.శ్రీధర్‌గౌడ్ తదితరులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. శ్రీకాంతాచారి ఆత్మార్పణతోనే తెలంగాణ సిద్ధించిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు స్కైలాబ్, నగేష్, శ్రీరాములు, శ్యాం, ప్రవీన్, కిరణ్,వేణు, మధు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



నీటిలో తడుస్తున్న రైతులు తెచ్చిన ఉల్లి గడ్డ బస్తాలు

ఉల్లి పంట తడుస్తున్నా పట్టించుకోరా?

● మలక్‌పేట మార్కెట్‌లో రోడ్లపై పారుతున్న నీరు

ఓల్డ్‌మలక్‌పేట డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో వరద సమస్య నిత్యకృత్యమైంది. తరచూ మంచినీటి పైపులు, డ్రైనేజీ పైపులైన్లు మ్యాన్ హోల్స్ పగిలిపోయి నీరంతా మార్కెట్‌లో ప్రవహిస్తోంది. బుధవారం మార్కెట్‌లో పైన ఉన్న మహబూబ్ మాన్షన్ నుంచి మంచినీటి పైపులైన్ పగిలి నీరంతా మార్కెట్‌లో ప్రధాన రోడ్డులో ప్రవహిస్తుంది. దీంతో రైతులు అమ్ముకోవడానికి తెచ్చిన ఉల్లిగడ్డ బస్తాలు వరద నీటిలో తడుస్తున్నాయి. మార్కెట్ అధికారులు ఈసమస్యను పలుమార్లు వాటర్‌వర్క్స్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయినా పరిష్కారానికి నోచుకోవడం లేదని, పైపులైన్ మరమ్మతు పనులు నామమాత్రంగా చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి మార్కెట్‌లో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.